క్లుప్తంగా

మండల వైద్యాధికారిగా వెంకట్‌రమణ



మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన వైద్యాధికారిగా వెంకట్‌రమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నర్వ మండల కాంట్రాక్ట్ వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వహించానని, బదిలీపై ఉమ్మడి మాగనూర్ మండలానికి వచ్చానని తెలిపారు. మండల ప్రజలకు సంబంధించి ఆరోగ్య పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు. కాగా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల సర్వీసు ఉందని ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులు అవసరం కాగా ఒక్క రెగ్యులర్ డాక్టర్ కూడా రాకపోవడం విచారకరమని ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యున్ని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో కారు ఢీ : ఏడుగురికి గాయాలు



మరికల్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద పత్తి ఆటో, కారు ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గోవా నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు, చిత్తనూర్ నుంచి రాయిచూర్ వెళ్తున్న పత్తి ఆటో మరికల్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటో డ్రైవర్ బుచ్చన్న, బోయ శ్రీనివాసులు, బోయ అంజన్నలతో పాటు కారులో ఉన్న నవీన్‌రెడ్డి, ప్రియంకరెడ్డి, దినేష్, మరోవ్యక్తి గాయపడ్డారు. వీరందరికి స్వల్పంగా గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మక్తల్: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యంగా ఉంటామని మక్తల్ సీఐ సీతయ్య, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. మక్తల్ పట్టణంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన వారు ఈనెల 5న హైదరాబాద్‌లో జరిగే పోటీలలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, అధ్యక్షుడు సత్యఅంజనేయులు, తాన్‌సింగ్, బాల్లేడు మల్లికార్జున్, అంజయ్యచారీ, శ్రీనివాసులు, కర్ని స్వామి, పీఈటీలు అంబ్రేష్, దామోదర్, హనీఫ్, గోవర్ధన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ తరగతులు ప్రారంభం



ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రియాజ్ హుస్సేన్ ఎంసెట్ తరగతులను ప్రారంభించారు. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్‌లో మంచి మార్కులు తెచ్చుకోవడంతో పాటు ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించాలని కోరారు. ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'రైతుబంధు' ఇవ్వాలి

నారాయణపేట టౌన్ : అర్హులందరికీ రైతు బంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్‌కు ఏఐపీకేఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర నాయకులు యాదగిరి, మాట్లాడుతూ డిసెంబర్ 2022 నాటికి రెవెన్యూ రికార్డులలో ధరణి పోర్టల్‌లో కొనుగోలు ద్వారా, ఇతర సమస్య కారణంగా పెండింగ్‌లో ఉన్న భూ రికార్డులు మార్పులు జరిగి రెవెన్యూ రికార్డులో తమ పేరు నమోదైన ప్రతి రైతుకు ఈ రబీ సీజన్లలో రైతుబంధు పథకం అమలు చేసి వారి ఖాతాలో డబ్బు జమ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాలు చూయిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులు దాదాపు నాలుగు లక్షలపైగా మందికి ఈ రబీ సీజన్లో రైతుబంధు డబ్బు జమ చేయకపోవడం బాధకరమన్నారు. ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శి ప్రశాంత్, నారాయణ, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.



చైతన్యమూర్తి సావిత్రీబాయి

- సేవలను కొనియాడిన నాయకులు, ఉపాధ్యాయులు
- ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



మక్తల్‌లో సావిత్రీబాయికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మక్తల్: మండలంలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బీసీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, ఏబీవీపీ, అంబేద్కర్ యువజన సంఘం, అంబేద్కర్ పున: ప్రారంభ కమిటీ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసం తదితర చోట్ల కార్యక్రమాలు జరిగాయి. బీఆర్ఎస్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, జీహెచ్ఎం అనిల్‌గౌడ్, గురుకుల ప్రిన్సిపల్ రాములు, ఎంఈఓ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కోస్గి: సావిత్రీబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరాములు సూచించారు. ఆమె జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి మహేష్, గౌరవ అధ్యక్షుడు కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలుకా అధ్యక్షుడు బ్యాగరి రాములు, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో జరిగిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు, నారాయణ, కొక్కు రోశణమ్మ, గౌతమ్, ప్రకాష్, పాల్గొన్నారు.

మాగనూర్: ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. మండలంలో జరిగిన ఆయా గ్రామాలలో జరిగిన జయంతి వేడుకల్లో మాగనూర్ సర్పంచ్ రాజు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రమేష్, మధుసుదన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నర్వ: మండలంలో జరిగిన సావిత్రీబాయి జయంతి వేడుకలలో బీసీ సంఘం మండల కన్వీనర్ సుధీర్, కల్వాల్, నర్వ ప్రాథమిక పాఠశాలలలో హెచ్ఎంలు ప్రసన్నకుమారి, మల్లేష్, బీసీ సంఘం నర్వ అధ్యక్షులు అయ్యలప్పయాదవ్, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గుడిసె వెంకటయ్య, నాయకులు సతీష్‌గౌడ్, ఫజల్, అనంతయ్యగౌడ్ పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని హిందుపూర్, కృష్ణా, కున్సి పాఠశాలల్లో మంగళవారం పూలే సావిత్రీబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మీరాకులకర్ణి, అజయ్, జ్యోతి, హనుమత్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని వివిధ గ్రామాలలో సావిత్రీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. కొండాపూర్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, గోటూర్ ఉన్నత పాఠశాల తదితరచోట్ల కార్యక్రమాలు జరిగాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలో జరిగిన ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ ఆశమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజయ్యగౌడ్, వార్డు మెంబర్ సంజీవరెడ్డి, చంద్రకాంత్, రవి పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో..



కొండాపూర్‌లో..



కోస్గిలో..

ప్రభుత్వ భూముల గుర్తింపు

మాగనూర్: మండలంలోని ప్రభుత్వ భూమిలో కొన్నింటిని ధరణి పోర్టల్‌లో పొందుపర్చలేదని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్ అన్నారు. మండలంలోని గ్రామాలకు సంబంధించి ప్రభుత్వ భూములను గుర్తించామని అన్నారు. వీటి సర్వే నెంబర్లను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో విచారణ అనంతరం వాటిని బ్లాక్ లిస్ట్‌లో చేర్చుతామన్నారు.

నేడు ఎఫ్‌ఎల్ఎన్ మేళా

నర్వ: మండలంలోని పాథర్చేడ్ ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి తొలిమెట్టు బోధనాభ్యాసన మేళాను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మినారాయణ మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ మేళా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విజయవంతం చేయాలన్నారు.

చట్టవ్యతిరేక వ్యాపారాలపై చర్యలు

మరికల్: చట్టవ్యతిరేక వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఏమాత్రం ఇలాంటి చర్యలను సహించబోమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన ఆయనను మంగళవారం మల్లికార్జున సంఘం సభ్యులు, వార్డు సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో అక్రమ వ్యాపారాలు, ఇసుక రవాణాలు, పేకాట వంటి చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు జరిగితే యువత పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాజసేవలో యువత పాత్ర కూడా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మల్లేష్, సురేందర్ రెడ్డి, రవి, బీరప్ప, రామకృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, కమల్, నాగరాజ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

నారాయణపేట రూరల్ : ప్రతీ వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని సీఐ రవిబాబు అన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం ట్రాఫిక్ సిబ్బందితో కలిసి పట్టణంలోని వివిధ చౌరస్తాల్లో విస్తృత తనిఖీలు చేపట్టి నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి వాటికి ప్లేట్ వేయించారు. నంబర్‌ప్లేట్ లేకపోతే సదరు వాహనాలను క్రైమ్ చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. జర్నలిస్టులు కానివారు ప్రెస్ స్టిక్కర్లు పెట్టుకోరాదన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్టును ఉపయోగించాలని, అవి ప్రాణాలను కాపాడుతాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆర్ఎస్ఐ రామకృష్ణ అన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పట్టణంలోని శ్రీసత్యనారాయణచౌరస్తాలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్ణీత వేగంతోనే వాహనాలను నడపాలని, ఇష్టారీతిగా పార్కింగ్ చేయరాదని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే ఫైన్ కట్టాల్సి వస్తుందన్నారు

ఉపాధ్యాయుల చేతిలోనే దేశ భవిష్యత్



కోస్గి: నేటి బాలలే రేపటి దేశ నిర్మాణ పౌరులని, వారికి విద్యాబుద్ధులు నేర్పించి సక్రమ మార్గంలో నడిపించే ఉపాధ్యాయులపైనే పరోక్షంగా దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు చదువుతోపాటు దేశ సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ ఉత్తమ దేశ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆ సంఘం నాయకులతో కలిసి 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరాములు, యూటీఎఫ్ సంఘ మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి మహేష్, సంఘ నాయకులు ఉమామహేశ్వర్‌రెడ్డి, కృష్ణగౌడ్, రాములు, బ్రహ్మయ్య, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, గౌరప్పతోపాటు పలువురు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి

నారాయణపేట టౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా నేటికి జిల్లాలో పొలాలకు సాగునీరు దిక్కు లేదని జలసాధన జిల్లా కో-కన్వీనర్ హెచ్.నర్సింహ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ దేశంలో నీళ్లు ఉన్నవి కానీ పొలాలకు రావు అనడం ఎంతవరకు న్యాయమన్నారు. 2014లో గవర్నర్ జీఓ-69ని అమలు చేసి పేట జిల్లా రైతులకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.

'నెలలు గడుస్తున్నా కూలి డబ్బులు ఇవ్వడం లేదు'

దామరగిద్ద: గత కొన్ని నెలల క్రితం ఉపాధిహామీ పథకంలో పనిచేసిన తమకు కూలీ డబ్బులు చెల్లించాలని ముస్తాపేటకు చెందిన కూలీలు ఆశప్ప, బస్సప్ప, బాపన్‌పల్లి వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. నర్సరీలో పనులు చేసి నెలలు గడిచినా ఇప్పటివరకు డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. అదేవిధంగా ఏడాది క్రితం చెరువు పూడికతీత, వాలుకట్టల నిర్మాణం పనుల డబ్బులు రావాల్సి ఉందని వాపోయారు. డబ్బులు రాలేదని అడిగితే ఈజీఎస్ అధికారులు టెక్నికల్ సమస్య పేరుతో డబ్బులు ఖాతాల్లో పడటం లేదని నిర్లక్ష్యపు సమాధానం చెబుతూ కాలం గడుపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూరగాయల సాగుపై అవగాహన

మరికల్: నారాయణపేట మండలం చిన్నజట్రం రైతు వేదికలో మంగళవారం మరికల్ రైతులకు, విద్యార్థులకు, అంగన్‌వాడీ టీచర్లకు నమూనా కూరగాయాల సాగుపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ పరుశురామ్ మాట్లాడుతూ పంటలకు ప్రత్యామ్నాయంగా కూరగాయలను సాగు చేస్తే రైతులు మంచి లాభాలను పొందవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన సాగు విధానాలను వివరించారు. రైతులు కూరగాయల సాగుపై ఎక్కువగా దృష్టి సారించాలని తెలిపారు.



మరికల్ రైతులు, విద్యార్థులకు నమూనా కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారి

క్రీడాప్రాంగణ పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

మాగనూర్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రతి పంచాయతీకో క్రీడా ప్రాంగణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాగనూర్ గ్రామంలోని నూతన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకు క్రీడాప్రాంగణాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. గురువారం మాగనూర్ క్రీడాప్రాంగణంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాపడిపూజ

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని శబరి పీఠం సన్నిధానం గురుస్వాముల ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్పస్వామి 31వ మహాపడిపూజోత్సవం నిర్వహించారు. బారంబావి నుంచి కలశంతో పాటు స్వామివారి చిత్రపటంతో బసవేశ్వర స్వామి ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పూజాకార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య, గురుస్వాములు జంగింటి వెంకటేష్, పోషల్ సంతోష్, అశోక్, తిప్పన్న, సంజీవ్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌వర్ధన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు చెన్నారెడ్డి, విజయ్‌సాగర్, అయ్యప్ప స్వాములు, మహిళలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో అయ్యప్పస్వామి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న మాలాధారులు

ప్రమాదకరంగా రహదారులు



గుంతలమయంగా కన్మనూర్ రోడ్డు



ధ్వంసమైన వెంకటాపూర్ తీలేర్ రోడ్డు

మరికల్: మరికల్‌లోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఆయా రహదారులపై అధికలోడుతో వెళ్లే వాహనాలు నడుపుతుండడంతో ధ్వంసమయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా కన్మనూర్, ఆత్మకూర్, వెంకటాపూర్, తీలేర్, మాధవరం, పల్లెగడ్డ గ్రామాల మీదుగా రోడ్లపై గుంతలు ఏర్పడడంతో రాత్రి వేళల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించాలి



కంసాన్‌పల్లి దారిలో ఉన్న బావిలో కాలుతున్న చెత్త

ధన్వాడ: ప్రభుత్వం రూ.లక్షల నిధులు వెచ్చించి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసినా వాటిని కొన్ని గ్రామ పంచాయతీలు వినియోగించడంలేదు. చెత్తను సేకరించి డంపింగ్ యార్డులో పోసి రీసైక్లింగ్ చేసే వాటిని వేరు చేయాల్సి ఉండగా ధన్వాడ గ్రామ పంచాయతీవారు మాత్రం కంసాన్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న బావిలో పోసి దగ్ధం చేస్తున్నారు. వీటిల్లో ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి వచ్చే మెడికల్ వ్యర్థాలు ఉంటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విషయంపై మండల పంచాయతీ శాఖ అధికారి సుదర్శన్‌ను వివరణ కోరగా అక్కడ చెత్తను వేయకూడదని, డంపింగ్‌యార్డుకు తరలించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించామని తెలిపారు.

అధ్వానంగా సామూహిక మరుగు దొడ్లు

- శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకోని అధికారులు
- పందులు, కుక్కలకు నివాసాలుగా మారుతున్న వైనం



మాడ్రన్ హై స్కూల్ వద్ద పరిస్థితి ఇలా..



పట్టణంలోని పళ్ల వీధిలో ముళ్లపొదల మధ్య సామూహిక మరుగుదొడ్డి

నారాయణపేట టౌన్ : జిల్లాకేంద్రంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆరుబయట బహిరంగ మలవిసర్జన నిర్మూలన, ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని గతంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. శిథిలావస్థలకు చేరుతున్న అధికారులు పట్టించుకోవడంలేదు. కనీస సౌకర్యాలు కల్పన సంగతి పక్కన బెడితే మరమ్మతులు కూడా చేయించడం లేదు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించినా ఫలితలేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల నిర్మించిన ఈ సామూహిక మరుగుదొడ్లు కనీస చర్యలు తీసుకోకపోవడంతో పందులు, కుక్కలకు నివాసంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రి రోడ్‌లోని మాడ్రన్ హై స్కూల్ వద్ద ఉన్న మరుగు దొడ్లు నీటి వ్యవస్థ, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తలుపులు విరిగిపోవడం, గోడలు బీటలు వారడంతో ఎవరూ వినియోగించడం లేదు. దీంతో ఇప్పటికై నా అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి

స్వచ్ఛభారత్‌లో భాగంగా బహిరంగ విసర్జన నిర్మూలించేందుకు కాలనీలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. కానీ నీటివసతి, విద్యుత్ సౌకర్యం వంటివి కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేయించాలి. – అనంతమ్మ, పళ్ల హరిజనవాడ

నూతన కమిటీ ఎన్నిక

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో మంగళవారం గొల్రెల కాపరుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూజారి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా కీరాలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా లింగప్ప, కార్యదర్శిగా బస్‌లింగాతో పాటూ మరో 5 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగరాజ్, మాలింగప్ప తదితరులు పాల్గొన్నారు.